"అడ్రసు మారింది"

శ్రీ రంగధామ్

ప్రొద్దున్నే ఎనిమిదిన్నర గంటలకు ఆఫీసంతా శుభ్రంచేసి తన స్టూలుమీద కూర్చుని, ఆలోచించసాగాడు దాసు. అతను ఆలోచించినకొద్దీ, తన సమస్యలకు పరిష్కారమార్గం ఒక్కటే అనే అభిప్రాయం బలపడసాగింది. తనింక ఈ ఆఫీసులో ప్యూను పని చెయ్యలేడు. మరో వుద్యోగం దొరికేవరకూ ఓపిక పట్టడం రోజురోజుకూ దుర్భరమైపోతోంది. ఏదో ఒకటి తొందరలోనే తేల్చెయ్యాలి—అనుకున్నాడు.

అతని వయస్సు ఇరవైరెండు; సుమారు మూడేళ్లబట్టీ 'సురేష్ ఏజన్సీస్' అనే పెద్ద వ్యాపార సంస్థ తాలూకు ఆఫీసులో 'బోయ్'గా పనిచేస్తున్నాడు దాసు. ఎక్కువగా చదువుకోకపోయినా, తనలాటి యువకుడికి, ఈ పని తగిదదికాదనీ, ఇంకా ఉన్నతమైనపదవి, కనీసం, గుమస్తా — యో — టైపిస్టో, తనకి తగినదని అతని నమ్మకం.

కాని, ఆ అభిప్రాయం 'సురేష్ ఏజన్సీస్' యజమాని అయిన రామారావుగారికి లేకపోవడమే దాసు దుస్థితికి కారణం. అయినా, దాసు, నమ్మకస్తుడనీ, అబద్ధమాడడనీ ఆయనకు గట్టి నమ్మకం వుండడం వలన అతనిని ఒకవిధమైన అభిమానంతో చూస్తారు. పెద్దబాబు (రామారావు) గారి అభిమానం ఆసరాగా తీసుకుని, దాసు—ఆ ఆఫీసులోని ఇద్దరు గుమాస్తాలనూ, టైపిస్టునూ కొంచెం డబాయిస్తూండడం కద్దు, అప్పుడప్పుడు.

అతని తత్వమే అలాంటిది అని సర్దుకుపోయినా, ఒక్కొక్కప్పుడు వాళ్లుకూడా దాసుమీద చిరాకుపడడం, అటువంటప్పుడు, వాళ్లు అతనికి, తను కేవలం ఆఫీసు ప్యూనునని గుర్తుచేయడం, దానితో, అతనికి గుండెల్లో ఎవరో పొడిచినట్లవడం, రెండు మూడు రోజులదాకా అతను క్రుంగిపోవడం జరుగుతూంటుంది.

తనుకూడా, గుమస్తాలతో సమానమైన హోదాలోవున్న వ్యక్తిలా ప్రవర్తించాలని అతని ఆరాటం. అతను ఉద్యోగంలోచేరిన మొదట్లో, ఎప్పుడూ నిలబడివుండడం — గుమస్తాలకూ టైపిస్టుకూ కాఫీలూ, మంచినీళ్లూ అందివ్వడం చేస్తూండేవాడు. పెదబాబుగారితో పరిచయం వృద్ధయిన కొద్దీ, తను ఆఫీసులోని చిన్నతరహా వ్యక్తులైన గుమస్తాలకు అంతగా భయపడనక్కరలేదనీ, వాళ్లు తనమీద 'రిపోర్టి'వ్వడం అంత తేలికకాదని గ్రహించాడు.

అంతేగాక పెదబాబు, ఆఫీసులో ఎవరూ లేనప్పుడు, తనని ఆయన గదిలోకి పిల్చి, గుమస్తాలు ఎన్నిగంటలకు ఆఫీసుకువచ్చేదీ, రోజుకు ఎంతసేపు వాళ్లలో వాళ్లు బాతాఖానీకొట్టేదీ, రెండు మూడు సార్లు అడగడంతో తను చాలా ముఖ్యమైన హోదా కల వ్యక్తిననే అహంకూడా అతనిలో పొడసూపింది.

తను ఇంచుమించు 'బాస్'కి 'పర్సనల్ అసిస్టెంటు'లాంటి వాడననే భావం కలిగి, అది క్రమంగా తనుకూడా, (పని లేనప్పుడు) కుర్చీలో కూచోవడం గుమస్తాలతో, తను ఒక్క పెదబాబుగారికి తప్ప మరెవరికీ, కాఫీలూ, మంచినీళ్లూ, అందించదల్చుకోలేదని చెప్పడంవరకూ వచ్చింది.

తనని ఆఫీసు ప్యూను అనికాక, 'మెస్సెంజరు' అనో 'అటెండర్' అని అనో అనాలని కూడా తరుచూ, ఆఫీసులో గుమస్తాలతో చెప్పనారంభించాడు.

కొంచెం తనని ఎవరైనా తక్కువగా చూసినట్లు కనిపిస్తే, వాళ్లమీద తన మనసులో కక్ష

గట్టి, వాళ్లని ఖాతరుచెయ్యకపోవటం ద్వారా తన కసిని వెలిబుచ్చేవాడు. 'వీళ్లేంచేస్తారోయ్ మనల్ని; అంతగా అయితే పెదబాబుగారితో చెప్పి ఉద్యోగం లోంచి తీయించేస్తారు. అంతేకదా ! అసలు మన కీ వుద్యోగమంటే లెక్కేలేదు' అని కొత్తగా వచ్చిన సూర్యం అనే రెండో ఆఫీసుబోయ్‌తో అనేవాడు, వాళ్లు వినేటట్లు.

రెండో ఆఫీసుబాయ్ ప్రవేశించి రెండు నెల లయింది. అతనికి పనంతా కొత్తవడం మూలానా, పెదబాబుగారు తరుచూ దాసునే పిలుస్తూండడం వలనా, దాసుమీద గౌరవం, దాసుద్వారా పనినేర్చు కోవాలనే ఆసక్తి కలిగింది.

దాసు, గుమస్తాలతో బాతాఖానీకొట్టూ, సూర్యానికి పనులు పురమాయిస్తూండేవాడు.

ఆ ఆఫీసులో, నాగేశ్వరరావు అనే ఇరవై మూడేళ్ల యువకుడు ఆరునెలల్రకింతం గుమస్తాగా చేరాడు. సన్నగా, పొడుగ్గా, ఎర్రగావుండే నాగేశ్వర రావు, ఉద్యోగం పురుషలక్షణం గాబట్టి, కాలక్షేపా నికి వస్తుందనీ, ఈ వుద్యోగంలో చేరాడుగాని, ఇది తన చదువుకు (అతను బి. యస్‌సీ) గాని తెలివికి గాని, తగినవుద్యోగం కాదనే విషయం రోజూ దాసుతో స్పష్టం చేస్తూంటాడు.

ముసలివాడైనా పెద్ద గుమాస్తా. స్వామిగారు, నాగేశ్వరరావుని పనివిషయంలో చివాట్లు పెట్తూంటే అతనికి ఎంతకష్టం కలిగినా, తరువాత స్వామిగారు లేనిప్పుడు, దాసు చూపించే సానుభూతివలన నాగేశ్వర రావు మనసు చాలా ఊరట చెందేది. ముఖ్యంగా స్వామిగారిని పెదబాబుగారు ఎలా చివాట్లు పెడు తూంటారో దాసు చెప్తూంటే నాగేశ్వరరావు ఆనం దంతో వింటూండే వాడు.

ఆ రోజు ప్రొద్దున్న దాసుఒక్కడూ కూర్చొని ఆలోచిస్తూంటే, నాగేశ్వరరావు చేతిలో ఒక పుస్త కంతో ప్రవేశించాడు. అతనిని చూడగానే దాసు 'గుడ్‌మార్నింగ్ సార్ ఏమిటూ పుస్తకం?' అని అడి గాడు.

'ఇది రీడర్సు డైజస్టోయ్!' అన్నాడు నాగేశ్వర రావు; తను డబ్బు ఖర్చుపెట్ట నక్కరలేకుండా ఈమధ్య కొన్ని పుస్తకాలు వచ్చి పడుతూండడంతో, అతనికి అలా అవి వచ్చినరోజున ఏదో ఘనవిజయం సాధించి నట్లుంటుంది.

నాగేశ్వరరావు తన సీటులో కూర్చున్నాడు. దాసు, లేచి అతనివద్దకువచ్చి, 'ఇదికూడా అలా వచ్చిం దేనా?...ఏదీ...ఒకసారి ఇవ్వండి... చూసిస్తాను' అని అడిగాడు.

'అవునోయ్. ఈనెలలో ఇది అప్పుడే నాలుగో సారి, ఇంతకు ముందు, ఏవో మాగజైన్లువచ్చాయి. కాని, ఈ పుస్తకం వాటికన్నా విలువైనది' అన్నాడు చిరునవ్వు నవ్వుతూ.

'భలే ఛాన్సుకొట్టున్నారే ! పాపం, అతనెవరో గాని, మీ పేరుగలతను, ఎన్నిటికి చందాకట్టాడో!' అన్నాడు దాసు.

తనసీటుకు సంబంధించిన కాగితాలు సర్దు కుంటూ, 'అవునవును. అసలు ఇన్ని పుస్తకాలెందుకో ఇతనికి !' అని తనలో తను అనుకున్నాడు, నాగే శ్వరరావు,

'పోస్టుమాన్, రేపెప్పుడైనావచ్చి, అసలాయన అడ్రసు దొరికిందనీ, ఇవి మీవికావనీ అంటే ఏం జేస్తారు?'

'దానిదేముంది. ఇవన్నీ నావని నేను పోస్టు మాన్‌తో చెప్పలేదు. అతనే కిటికీలోంచి పడేసి పోతున్నాడు.'

'తమాషాగా వుంది సార్. ఈ నాగేశ్వరావు ఎవరో కాని, డోర్‌నెంబరు ఇచ్చివుంటే ఇంత తికమక వుండేదిగాదు.'

'కానీ ఇలా ఎన్నాళ్లు జరిగితే అన్నాళ్లు జర గనీ, మనదేంపోయింది!' అన్నాడు నాగేశ్వరరావు తనలో తను నవ్వుకుంటూ.

దాసు ఆ పుస్తకం తిరగేస్తూ, ఆ అజ్ఞాత వ్యక్తి—నాగేశ్వరరావు అనే పేరుగల మరొకనిని వూహించుకుని అతనిమీద సానుభూతి చూపించ నారంభించాడు.

కొద్దిరోజుల క్రితం నాగేశ్వరరావుకి కొన్ని

పుస్తకాలు రావడంతో ఈ సంఘటన ప్రారంభమైంది. అది పోస్టుమన్ చేసినపని. యస్. నాగేశ్వరరావు, అగ్రహారం, గుంటూరు అనే అడ్రసుతో వచ్చిన వాటిని, అగ్రహారంలోవున్న నాగేశ్వరరావు (యస్.) ఇతనొక్కడే అతనికి తెలిసివుండడంవలన, ఇతనికే అయివుంటుందని ఇతని ఇంట్లో పడెయ్యసాగాడు.

తనవికాని వస్తువులు తమవద్దకు వచ్చినప్పుడు కొందరు మర్యాదగా వాటిని అసలు యజమానికి అందచేద్దామను కొంటారు. కాని అటువంటివారి సంఖ్య ప్రజల్లో మైనారిటియే! మెజారిటీ తమవి కాని వస్తువుల్ని తామే ఉంచుకుని అనుభవించటంలో ఎంతో ఆనందం అనుభవిస్తారు. అసలు వస్తువు— అవతల ఒకమనిషికి కాక, ఎంతోమందికి చెందినదైతే, మరీ ఘనంగా భావిస్తారు. గవర్నమెంటువారి ఇళ్లనీ, కార్లనీ, తమ సొంతానికి వాడుకుని ఎంత మంది ఆనందిస్తున్నారు!

నాగేశ్వరరావు, తనపేరుగల వ్యక్తి వస్తువులు కాబట్టి వాటిమీద తనకూ హక్కువుందని, పోస్టుమాన్‌కి అసలువిషయం తెలియజెయ్యడం మానేశాడు. మొదట్లో, పోస్టుమాన్, మళ్లీ మర్నాడో, రెండు రోజుల తర్వాతోవచ్చి, వాటిని, అసలు వ్యక్తికివ్వాలని లాక్కుపోతాడేమోనని భయపడుతూండే వాడు.

కానీ అలా జరక్కపోవడంతో క్రమంగా అతనికి ధైర్యంవచ్చింది. మరికొన్నిరోజులు పోయిన తరువాత, ఇలా ఈ పుస్తకాలు ఇంకా ఎంతకాలంవస్తాయో అన్న ఆతృత ప్రారంభమైంది. అతనిలో అసలు ఈ మరో నాగేశ్వరరావు నిజంగా ఎక్కడ వున్నట్లు? ఈ పుస్తకాలకి చందాకట్టి, అవి వచ్చాయో లేదో ఎందుకు పట్టించుకోవటం లేదు? అన్న ప్రశ్నలు అతనిని వేధించినా, వాటిని బలవంతాన ప్రక్కకు నెట్టేసి, ఆ పుస్తకాలని సొంతం చేసుకోవడంలో వున్న ఆనందం అనుభవించ సాగాడు.

'ఆయనపేర వచ్చిన వుత్తరాలుకూడా మీకిస్తున్నాడా పోస్టుమాన్?' అని అడిగాడు దాసు.

'ఎందుచేతనో గాని, ఉత్తరాలేమీ రావటం లేదోయ్.'

'మరి ఒకవేళ మనియార్డర్లు వస్తే ఏంచేస్తారు?'

'పోస్టుమాన్ ఇస్తాడంటావా?'

'అయితే వాడివ్వాలేగాని, మీరు తీసుకుంటారన్నమాట. అలాటి పనెప్పుడూ చెయ్యకండి సార్. పాపం, అవతలివాడు ఆ డబ్బుకోసం ఎంత యిబ్బంది పడతాడో!'

'ఆ, ఈ రోజుల్లో పాపపుణ్యాలకు భయపడే వాళ్లెవరోయ్, అంతగా మననిదాకి వస్తే, నాపేరూ అదేకాబట్టి, సంతకం పెట్టానంటాను.'

'అది సరేసార్. అసలు వ్యక్తికి ఆ డబ్బు చాలా ముఖ్యమైనదైతే...'

'ఏం, ఎందుకనుకోవాలి. అతను బహుశా బాగా డబ్బున్నవాళ్లబ్బాయేమో. వాళ్లకు ఈ డబ్బంటే ఖాతరులేకపోవచ్చు. అందుకని అది మనం వాడుకోవటంలో తప్పులేదేమో.'

'ఎంతైనా పరాయివస్తువ...' అని దాసు ఏదో అనబోతూంటే పెదబాబుగారి గదిలో కాలింగ్‌బెల్లు మ్రోగడంవలన దాసు అటువైపు వెళ్లడంతో ఆ చర్చ ఆగింది.

నాగేశ్వరరావుకూడా తను టైపిస్టు కివ్వవలసిన కాగితాలు తీస్తూ, ఆఫీసు ధ్యాసలోపడ్డాడు.

మరొక పదినిముషాలుపోయాక దాసు మళ్లీ వచ్చి నాగేశ్వరరావుప్రక్కన కూచొని మాట్లాడ నారంభించాడు. 'ఏమండోయ్, ఒకసారి ఏం జరిగిందో తెలుసా, పెదబాబుగారు, తమ గదిలో ఒకసారి పర్సు మరిచిపోయారు. నేను, ఆయన సాయంకాలం క్లబ్బుకు వెళ్లిపోయాక, ఆఫీసు తలుపులువేద్దామని వెడితే, ఆయన కుర్చీదగ్గర కన్పించింది అది. నేను వెంటనే అది జేబులోపెట్టుకుని, ఆయనకు తర్వాత ఇద్దామనుకుని మరిచిపోయాను. రెండు రోజులు పోయాక నాకు జ్ఞాపకంవచ్చింది. ఈ లోపల ఆయనా అడగలేదు. తను క్లబ్బులో పోగొట్టుకుని ఉంటాననుకున్నారట. నేను ఆ రెండురోజులూ పనుల హడావుడిలో మరిచిపోయేను. మూడోరోజున నాకేజ్ఞాపకంవచ్చి, 'సార్ మీరు ఆఫీసులో మొన్న మరిచిపోయిన పర్సు ఇదుగో!' అని

తీసిచ్చాను. ఆయన తెల్లబోయి, అది తీసుకుని, లోపల డబ్బు సరిగా వుందో లేదో చూసుకుని, 'ఇందులో ఎంతుందో నీకు తెలుసా?' అని అడిగారు. నాకు తెలియదనీ, నేను చూడలేదనీ చెప్పాను. అప్పుడాయన నలభై వందరూపాయల నోట్లు తీసి చూపించారు.'

'నాలుగు వేలే!' అన్నాడు నాగేశ్వరరావు.

'అవును సార్ !'

'ఎటువంటి ఛాన్సు పోగొట్టుకున్నావ్ ! అది, దాచేసి, ఎలాగా ఆయన అడగలేదు కాబట్టి, మరో వారంరోజులు వూరుకుని, పనిమానేసి, హాయిగా ఆ డబ్బుతో చిన్నవ్యాపారం పెట్టుకుంటే...'

'ఛీ ! ఎందుకు సార్ ! అలాంటి పాడుపని ! నేనంత నిజాయితీగా ఇవ్వబట్టే, ఆయనకి నేనంటే అభిమానం.'

'ఎందుకొచ్చిన అభిమానమోయ్, నీకేమైనా జీతం పెంచారా ? ప్రమోషనిచ్చారా ?' అని నాగేశ్వరరావు అడగ్గా, దాసు మౌనంగా వూరుకున్నాడు. ఇద్దరి మనస్సులలోనూ రెండురకాల ఆలోచనలు మెదిలాయి. ఇద్దరికీ తాము జీవితంలో పైకిరావాలని గాఢమైన కోరికవుంది.

నాగేశ్వరరావుకి ఈ కంపెనీలో నూరు రూపాయలు జీతంఇస్తారు. కనీసం రెండువందలు జీతం వచ్చే ఉద్యోగం కావాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాడు. ఒక పెద్ద పొగాకుకంపెనీ యజమానికి రికమెండేషన్‌కోసం ఎంతో తంటాలు పడుతున్నాడు. రికమెండేషన్ లెటరు వెళ్లింది. తనకు ఇంటర్‌వ్యూ కొద్దిరోజులలో రావచ్చునని తెలిసింది. ఆ కంపెనీలో రెండువందలపైన జీతం దొరుకుతుంది. అలా ఏదో రికమెండేషనో, లంచమో, పారేసి చరా చరా పైకెగబ్రాకాలిగాని, నీతికి, నిజాయితీకి రోజులా ఇవి ? అని, దాసు తెలివితక్కువతనానికి, నాగేశ్వరరావు విచారించాడు.

దాసుకి నాగేశ్వరరావుఅన్న మాట కూడా నిజమే ననిపించింది. తను ఎంత నిజాయితీగా ప్రవర్తించినా పెదబాబుగారు తనకు సరియైన ఇంక్రిమెంటుగాని, ప్రమోషన్‌గాని ఇవ్వటంలేదని తను బాగా చదువుకోలేదు గాబట్టి, తనకు గుమస్తాపని చేతకాదని ఆయన ఉద్దేశం. ఇప్పుడు తనకి నెలకి ఎనభై ఇస్తున్నారు. కనీసం వందరూపాయ లైతే ఎలాగో సర్దుకోవచ్చు. తనజీతం తనకి ఎంతమాత్రం చాలటంలేదు. అయినా తన మనస్సుమాత్రం ఏపాపవు పనికీ ఒప్పుకోదు. చిన్నప్పటినుండీ పరాయి వస్తువును నిప్పుతో సమానంగా చూడడం, తన వస్తువు కోసం దెబ్బలాడైనా తీసుకోవటం అతని కలవాటయింది.

ఇద్దరి ఆలోచనలూ తలోకదారిలో వెడుతూనే వుండేవి. రోజులు క్రమంగా దొర్లసాగాయి.

దాసుకు, రెండునెలలు గడిచినా తన సమస్యకు పరిష్కారమార్గం కన్పించలేదు. కానీ అతని మనసు నిజాయితీకీ ప్రాధాన్యంఇవ్వడం మానలేదు. పెదబాబుగారు, ఏమీ గమనించనట్లు ఉన్నా దాసు మనస్తత్వం పూర్తిగా అర్థం చేసుకున్నారు. ఒకనాడు దాసునిపిలిచి, అతనియింటి పరిస్థితులూ, అతనికి జీతం సరిపోతున్నదీ లేనిదీ అడిగారు. అదేసమయం అని దాసు, ఉన్నవీ లేనివీ కల్పించి చెప్పలేదుగాని, తనకు జీతం చాలటంలేదనీ, మరొక ఇరవైరూపాయలు ప్రతినెలా అప్పు చెయ్యవలసి వస్తోందని చెప్పాడు. ఇంకా చాలా చాలా చెప్పదలచుకున్నాడు గాని అవి నోట్లోంచి పెగల్లేదు.

కాని పెదబాబుగారు దాసు తత్వం అర్థం చేసుకున్నారు. అందుకే మరొక నెలరోజులు పోయింతరువాత అతనికొక అవకాశం ఇచ్చారు.

ఆ రోజు మధ్యాహ్నం దాసు ఉత్సాహంగా నాగేశ్వరరావు వద్దకువచ్చి 'ఏమండోయ్ నేనీపనికి రాజీనామా ఇస్తున్నాను' అంటూంటే నాగేశ్వరరావు తెల్లపోయాడు.

'ఏమిటోయ్ మరో ఉద్యోగం అయిందా ?'

'అవునుసార్. లక్ష్మిరైసుమిల్లులో స్టోరుకీపరుగా చేరుతున్నాను. జీతంకూడా ఎక్కువే' అన్నాడు దాసు.

'లక్ష్మి రైసుమిల్లు అంటే పెదబాబుగారి బావమరదిదే కదా?' అని నాగేశ్వరరావు ఆశ్చర్యపోయాడు.

'అవును సార్, ఇది పెదబాబుగా రిప్పించిందే. అక్కడ స్టోరులో ఒక నమ్మకమైన వ్యక్తి కావాలంటే, నన్ను రికమెండు చేశారు. ఇకనుంచి మనం ఆఫీసుబోయి కాము, క్లాసు III లో చేరుతున్నాం. చూశారా, మనిషిలో నిజాయితీ వుంటే భగవంతుడెలా సాయం చేస్తాడో, జీతం నూట ముప్పై'.

'అబ్బా!' అని అంటూ నాగేశ్వరరావు, దాసు అదృష్టంచూసి మనసులో అసూయ పొందాడు. నిజాయితీ ఏమిటి వీడి మొహం! కేవలం ఇది వాడి అదృష్టమే! కాకపోతే మూడు నెలల్క్రితం ఒక గట్టి రికమెండేషన్ చేయించినా, ఆ పొగాకు కంపెనీనుండి తనకింకా ఇంటర్వ్యూ రాలేదు. అది తన దురదృష్టం వలన కదూ!

తన దురదృష్టాన్ని అనేక విధాల తలపోసుకుంటున్న నాగేశ్వరరావుకి, పోస్టుమాన్ ఒక కవరిచ్చి వెళ్లాడు. సాధారణంగా తనకు కంపెనీ అడ్రసుకు ఉత్తరాలు ఎప్పుడోగాని రావు. ఎవరు రాశారా అని చింపి చదివాడు. అందులో ఇలా వుంది.

చిరంజీవి నాగేశ్వరరావుకు మీ మావయ్య ఆశీర్వదించి వ్రాయునది,

నీ వుత్తరం నాకు చాలా అశ్చర్యం కలిగించింది. నేను నీ గురించి రికమెండేషన్ చెయించిన వెంటనే, నీకు ఇంటర్వ్యూకార్డు పంపడం, ఇంటర్వ్యూలో నిన్ను సెలక్టు చెయ్యడం జరిగిందనీ, నువ్వు వెంటనే డ్యూటీలో చేరావనికూడా, అక్కడనుంచి ఇక్కడకు వచ్చిన ఒకతను చెప్పాడు. నీ వుత్తరం చూడగావే నేను వాకబుచేస్తే తేలినదేమంటే, నీకు పంపిన ఇంటర్వ్యూ కార్డు నీ పేరుగల మరొక వ్యక్తికి, పోస్టు వాళ్ల పొరపాటు వలన అందడం అతనా సదవకాశం వినియోగించడం జరిగిందని; అంతేకాక అప్పుడు మనం రికమెండేషన్ చేయించిన మానేజరు ఆ వూరు నుంచి మరో వూరు బదిలీ అయివెళ్లిపోయాడని తెలిసింది. అందువల్ల జరిగిన పొరపాటును దిద్దుకునే అవకాశంకూడా లేకపోయింది. రెండువందల ఏభై జీతంవచ్చేపోష్టు, మన కర్మకొద్దీ, మరొకడు తన్నుకుపోయాడు.........

నాగేశ్వరరావుకి భూమి గిర్రున తిరిగినట్లైంది. తూలి, కుర్చిలోంచి క్రిందకు పడినంత పనైంది. తన దురదృష్టాన్ని నిందించుకోవడంతోబాటు, అప్పుడే పోస్టుమాన్ యొక్క తప్పును సరిదిద్దనందుకు విచారించాడు. అతని పుస్తకాలు తనకు వచ్చినట్లే తన వుత్తరాలు అతనికి వెళ్లవచ్చునని ఆలోచించనందుకు విచారం, బాధా, తనమీద తనకి కోపం కలిగాయి. అయినా అవతలివాడు, తనవికాని ఉత్తరాలు తీసుకుని, ఇతరుల ఉద్యోగా లపహరించేటంతటి నీచుడవడం ఆశ్చర్యంగా వుందనుకున్నాడు. మనుషులలో, నీతి నిజాయితీ బొత్తిగా పోతున్నాయి—అని క్రుంగిపోయాడు నాగేశ్వరరావు.

ఇటువంటి ప్రపంచంలో తనలాటి వాడెలా బ్రతకడం? అని ప్రశ్నించుకున్నాడు. అలా ఆలోచిస్తూనే, తన ప్రమోషన్ సందర్భంగా అందరికీ 'టీ' ఇస్తున్న దాసు చేతుల్లోని టీ కప్పు అందుకున్నాడు.